ఆధ్యాత్మిక చింతనతో అన్నీ శుభాలే



ఇరుముడితో శబరిమలకు బయలుదేరిన ఎమ్మెల్యే శ్రీగణేష్

కంటోన్మెంట్: ఆధ్యాత్మిక చింతనతో అన్నీ శుభాలే కలుగుతాయని ఎమ్మెల్యే శ్రీగణేష్ అన్నారు. 41 రోజులు పాటు అయ్యప్ప స్వామి దీక్షలో ఉన్న కంటోన్మెంట్ శాసన సభ్యులు శ్రీగణేష్ గురువారం బొల్లారం అయ్యప్ప దేవాలయంలో ఇరుముడి కట్టుకొని శబరిలోని అయ్యప్ప దేవాలయానికి బయలుదేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అయ్యప్ప దీక్ష తీసుకునే భక్తులకు దేవాలయ ఆవరణలో తగిన సదుపాయాలు కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కుటుంబ సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కలుషిత జలాల సమస్య పరిష్కారానికి కృషి



డ్రైనేజీ మ్యాన్‌హోల్స్ పరిశుభ్ర పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్

చిలకలగూడ : సీతాఫల్‌మండి డివిజన్‌లో సరఫరా అవుతున్న కలుషిత జలాల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని స్థానిక కార్పొరేటర్ సామల హేమ తెలిపారు. నామాలగుండులో కలుషిత జలాలు సరఫరా అవుతున్నాయని ఫిర్యాదులు అందడంతో జలమండలి సెక్షన్ మేనేజర్ కుషాల్‌తో కలిసి ఆయా ప్రాంతాలను పర్యటించారు. డ్రైనేజీ, మంచినీటి పైప్‌లైన్లు కొన్ని చోట్ల శిథిలావస్థకు చేరడంతో సమస్య ఉత్పన్నం అవుతున్నట్లు గుర్తించారు. డ్రైనేజీ మ్యాన్‌హోల్స్ పరిశుభ్రం చేయడంతోపాటు ఆయా ప్రాంతాల్లో నూతన పైప్‌లైన్లు ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన



ట్రాఫిక్ నియమాలు వివరిస్తున్న దృశ్యం

చిలకలగూడ : జాతీయ రహదారి భద్రత మాసోత్సవాలను పురస్కరించుకుని చిలకలగూడ ట్రాఫిక్ పోలీసులు శుక్రవారం మెట్టుగూడ జంక్షన్, మెట్రో స్టేషన్ల వద్ద రోడ్డు ప్రమాదాల నివారణపై పలువురు పాదచారులకు అవగాహన కల్పించారు. ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్ శ్రీనివాసులు మాట్లాడుతూ.. జీబ్రా క్రాసింగ్ వద్ద మాత్రమే రోడ్డును దాటాలని, గ్రీన్ సిగ్నల్ పడినప్పుడే క్రాస్ చేయాలని, ఫుట్ ఓవర్ బ్రిడ్జిలను వినియోగించాలని సూచించారు. రోడ్డు దాటేముందు ఇరువైపులా కదులుతున్న వాహనాలను గమనించాలన్నారు.

ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలి



నిరసన తెలుపుతున్న మహిళ గృహ కార్మికులు

అడ్డగుట్ట: సొంతిళ్లు లేని మహిళ గృహ కార్మికులకు ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేయాలని దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర కార్యదర్శి పులి కల్పన డిమాండ్ చేశారు. రైల్ నిలయం వెనుక ఉన్నటువంటి అంబేద్కర్ నగర్‌లో ఇండ్లు లేని పేదలతో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కల్పన మాట్లాడుతూ ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకున్న పేదలకు డబుల్ బెడ్రూమ్‌లు, ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలన్నారు. త్వరలో జిల్లా కలెక్టర్, జీహెచ్‌ఎంసీ కమిషనర్, సీఎం ప్రజావాణిలో నోడల్ అధికారికి ఫిర్యాదు చేస్తామన్నారు. ఈ నిరసనలో మహిళ గృహ కార్మికులు పాల్గొన్నారు.

భారీ సెట్టింగులు.. విద్యుత్ దీపాలతో అలంకరణ

- ముక్కోటికి ముస్తాబైన ఆలయాలు
- సంతరించుకున్న ఆధ్యాత్మిక శోభ
- ఉత్తర ద్వార దర్శనానికి ఏర్పాట్లు

చిలకలగూడ: ముక్కోటి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని పలు ఆలయాలను పుష్పాలు, విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. దేవతామూర్తుల భారీ సెట్టింగులతో ఆధ్యాత్మికశోభ సంతరించుకుంది. ఉత్తర ద్వారం నుంచి స్వామివారిని దర్శించుకునేందుకు ఆలయ నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేపట్టారు. సీతాఫల్‌మండి డివిజన్ నామాలగుండులోని కళ్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద విద్యుత్ దీపాలతో ఏర్పాటు చేసిన సెట్టింగులు చూపరులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. శ్రీనివాసనగర్ శ్రీగిరి ప్రసన్న వెంకన్నస్వామి, చిలకలగూడ సాయిబాబా సమేత బాలాంజనేయస్వామి ఆలయాల్లో వైకుంఠ ఏకాదశి వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించనున్నారు. శ్రీగిరి ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో స్వామివారి ముఖచిత్రాలతో ప్రత్యేకంగా రూపొందించిన కేలండర్‌ను భక్తులకు ఉచితంగా అందించనున్నట్లు ఆలయ ఈఓ రాజేష్‌కుమార్, చైర్మన్ బసవరాజు శ్రీనివాస్‌లు తెలిపారు.

60 అడుగుల డిజిటల్ లైటింగ్ గోపురం...

నామాలగుండు కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రధాన ద్వారం వద్ద ఏర్పాటు చేసిన 60 అడుగుల డిజిటల్ లైటింగ్ గోపురం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. స్వామివారిని దర్శించుకునేందుకు ఏడు ద్వారాలతో ఉత్తరద్వారాన్ని ఏర్పాటు చేశారు. శుక్రవారం వేకువజాము 3 గంటలకు సుప్రభాతసేవతో వైకుంఠ ఏకాదశి వేడుకలు ప్రారంభం అవుతాయని, ఉదయం 9 గంటల నుంచి సర్వదర్శనం ఉంటుందని ఆలయ చైర్మన్ నోముల ఇందిరాప్రకాశరావు తెలిపారు.



కల్యాణ వెంకన్నస్వామి ఆలయంలో ..



పుష్పాలు, విద్యుత్‌దీపాలతో అలంకరించిన ఉత్తర ద్వారాలు



నామాలగుండు కళ్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద..



సనత్‌నగర్ హనుమాన్ ఆలయంలోని వేంకటేశ్వర స్వామి గుడిలో..

వైష్ణవాలయాలు ముస్తాబు

సనత్‌నగర్: వైకుంఠ ఏకాదశి పర్వదిన ఉత్సవాలకు సనత్‌నగర్ నియోజకవర్గంలోని వైష్ణవాలయాలు ముస్తాబయ్యాయి. శుక్రవారం వేడుకల సందర్భంగా ఆలయ కమిటీలు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నాయి. భక్తుల కోసం అన్ని వసతులూ కల్పిస్తున్నారు. ప్రతియేటా వైకుంఠ ఏకాదశిని వైభవోపేతంగా నిర్వహించడం సనత్‌నగర్ దేవాలయ ప్రత్యేకతగా చెబుతుంటారు. సప్తద్వారాల మీదుగా ఉత్తర ద్వార దర్శనం చేసుకునేందుకు శ్రీకళ్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఏర్పాట్లు చేశారు. ఉత్సవాల్లో భాగంగా స్వామివారికి ప్రత్యేకంగా పుష్పాలంకరణ, ఏడు ద్వారాలతో అలంకరించిన ఉత్తర ద్వారంలో దర్శనం, విశేష పూజలు జరుగుతాయని ఈఓ సత్యనారాయణ, ఆలయ ప్రధాన అర్చకులు రవీంద్రాచార్యులు తెలిపారు.

◆ ఎస్‌ఆర్‌నగర్‌లోని శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయం, బేగంపేట శ్యాంలాల్ బిల్డింగ్స్‌లోని వెంకటేశ్వర ఆలయంలో ముక్కోటి ఏకాదశి ఏర్పాట్లు చేశారు.

నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

సనత్‌నగర్: పాటిగడ్డ సబ్‌స్టేషన్ పరిధిలోని జీరా, హనుమాన్ టెంపుల్, రాణిగంజ్ ఫీడర్ లైన్ల మరమ్మతుల కారణంగా శుక్రవారం పలు ప్రాంతాల్లో కరెంటు సరఫరా ఉండదని ప్యారడైజ్ సీబీడీ ఏడీఈ ఆదినారాయణరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు రాణిగంజ్ డిపో, అంబేద్కర్‌నగర్, మధ్యాహ్నం 12 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అంబేద్కర్ నగర్, డబుల్ బెడ్‌రూమ్స్, మోక్ష హోటల్, పీఎం మో కాంప్లెక్స్, సుందరం మోటార్స్, హనుమాన్ టెంపుల్, బుద్ధ భవన్ ఏరియా, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నల్లగుట్ట స్కూల్, పోచమ్మ టెంపుల్, మొఘల్ క్యాస్టిల్, నల్లగుట్ట మసీదు ప్రాంతాల్లో విద్యుత్ కోత ఉంటుందని పేర్కొన్నారు.

నేడు శ్రీనివాసనగర్‌లో ఉచిత వైద్య శిబిరం

చిలకలగూడ : సీతాఫల్‌మండి డివిజన్ శ్రీనివాసనగర్ శ్రీగిరి ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం, వాస్కులర్ స్క్రీనింగ్ క్యాంపు నిర్వహించనున్నట్లు కేఎం క్లినిక్ నిర్వాహకుడు డాక్టర్ అజయ్ బీ మోసూర్ తెలిపారు.

నీటి సమస్యను పరిష్కరించండి

సనత్‌నగర్: బ్రాహ్మణవాడీలో నెలకొన్న మంచి నీటి సమస్యను పరిష్కరించాలని స్థానికులు గురువారం మాజీ ఎమ్మెల్యే మర్రి శశిధర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. లో ప్రెషర్ కారణంగా నీరు సరిపడా రాక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. జలమండలి అధికారులతో ఫోన్‌లో మాట్లాడి సమస్యను పరిష్కరించాల్సిందిగా సూచించారు.

ఫుట్‌బాల్‌లో సత్తా చాటిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు



ఫుట్‌బాల్ పోటీల్లో రన్నరప్‌గా నిలిచిన నల్లగుట్ట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు

సనత్‌నగర్: రాంగోపాల్‌పేట్ నల్లగుట్ట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ఫుట్‌బాల్‌లో సత్తా చాటారు. పాల్–బోంకే ఆధ్వర్యంలో గోల్కొండ క్రీడా మైదానంలో జరిగిన హైదరాబాద్ రీజనల్ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో సబ్–జూనియర్ (అండర్–10) విభాగంలో రెండో స్థానంలో నిలిచారు. మొత్తం 35 జట్లు ఈ పోటీల్లో పాల్గొన్నాయి. అండర్–10 విభాగంలో నల్లగుట్ట ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు ఆరు రోజుల లీగ్ మ్యాచ్‌ల్లో అన్నింట్లోనూ విజయం సాధించారు. బుధవారం జరిగిన ఫైనల్ మ్యాచ్‌లో టోర్నమెంట్ రన్నరప్‌గా నిలిచారు.

బన్సీలాల్‌పేట్ బీజేపీ అధ్యక్షుడిగా మహేష్



బన్సీలాల్‌పేట్ బీజేపీ అధ్యక్షులు రామంచ మహేష్

బన్సీలాల్‌పేట్: బీజేపీ బన్సీలాల్‌పేట్ డివిజన్ నూతన అధ్యక్షుడిగా రామంచ మహేష్ ఎంపికయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ ఎన్నికల జిల్లా రిటర్నింగ్ అధికారిగా వ్యవహరించిన మాధవరపు కాంతారావు ప్రకటించారు. ఈ సందర్భంగా మహేష్ విలేకరులతో మాట్లాడారు. తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ముచేయకుండా పార్టీ అభివృద్ధికి చిత్తశుద్ధితో పనిచేస్తానన్నారు.

వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లను పరిశీలించిన డీసీపీ



ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఈస్ట్‌జోన్ డీసీపీ బాలస్వామి తదితరులు

చిలకలగూడ : చిలకలగూడ ఠాణా పరిధిలోని పలు ఆలయాల వద్ద చేపట్టిన వైకుంఠ ఏకాదశి ఏర్పాట్లను చిలకలగూడ ఏసీపీ జైపాల్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్ అనుదీప్‌లతో కలిసి ఈస్ట్‌జోన్ డీసీపీ బాలస్వామి శుక్రవారం పరిశీలించారు. నామాలగుండు కళ్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ముక్కోటి ఏకాదశి నిర్వహణ ఏర్పాట్లపై ఆలయ చైర్మన్ నోముల ప్రకాశరావుతో చర్చించారు. సుమారు లక్షమంది భక్తులు స్వామివారిని ఉత్తర ద్వారం నుంచి దర్శించుకుంటారని, ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా తగిన ఏర్పాట్లు చేపట్టామని ఆయన వివరించారు. ట్రాఫిక్ డైవర్షన్, భక్తులకు క్యూలైన్లు తదితర అంశాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ నోముల ప్రకాశరావు, సీతాఫల్‌మండి కార్పొరేటర్ సామల హేమ, స్థానిక నాయకులు కరాటే రాజు, జగదీశ్వరరావులతో పాటు పలువురు పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

కాలనీ సమస్యలు పరిష్కరిస్తా : తలసాని



కేలండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

అమీర్‌పేట: అమీర్‌పేట డివిజన్ సంజీవరెడ్డినగర్ కాలనీలో నెలకొన్న ఉన్న సమస్యలను పరిష్కరిస్తానని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ హామీ ఇచ్చారు. గురువారం వెస్ట్ మారేడ్‌పల్లిలోని తన కార్యాలయంలో ఎస్‌ఆర్‌నగర్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన 2025 సంవత్సర కేలండర్‌ను ఆవిష్కరించారు. కాలనీ సమస్యలను వివరిస్తూ ఒక వినతి పత్రాన్ని సమర్పించారు. సంక్రాంతి పండుగ అనంతరం అధికారులతో కలిసి కాలనీలో పర్యటించి సమస్యలు పరిష్కరిస్తానని చెప్పారు. కార్యక్రమంలో కాలనీ వాసులు నరేందర్‌రెడ్డి,గౌతం,వివేక్‌నాథ్ పాల్గొన్నారు.

అయ్యప్ప భక్తులకు దుప్పట్ల పంపిణీ

చిలకలగూడ : కఠోర నియమదీక్షలతో శబరికొండకు పయనమైన పలువురు అయ్యప్ప భక్తులకు టీపీసీసీ గ్రేటర్ ఉపాధ్యక్షుడు, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు నాగులూరి సాయిబాబా దుప్పట్లు పంపిణీ చేశారు. సికింద్రాబాద్ హమాలీబస్తీలో శుక్రవారం జరిగిన పడిపూజకు ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన దుప్పట్లు, టవళ్లు ఉచితంగా అందించారు. గత కొన్నేళ్లుగా ప్రతిఏటా అయ్యప్ప దీక్షధారులకు బెడ్‌షీట్లు ఉచితంగా పంపిణీ చేస్తున్నట్లు గ్రేటర్ ఉపాధ్యక్షుడు నాగులూరి సాయిబాబా తెలిపారు. కార్యక్రమంలో బస్తీ కాంగ్రెస్ నాయకులు అంజి, దేవుడు వెంకట్, కృష్ణ, తిరుపతి, సతీష్, ప్రమోద్‌లతోపాటు పెద్దసంఖ్యలో గురుస్వాములు, అయ్యప్ప మాలాధారులు పాల్గొన్నారు.



భక్తులు ఇబ్బంది పడకుండా చర్యలు తీసుకోండి



ఎమ్మెల్యే తలసానికి ఆహ్వానపత్రికను అందజేస్తున్న కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి

సనత్‌నగర్: వైకుంఠ ఏకాదశి సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అధికారులకు సూచించారు. సనత్‌నగర్ హనుమాన్ దేవాలయం (సెవన్ టెంపుల్స్) ప్రాంగణంలోని శ్రీకళ్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో జరిగే వైకుంఠ ఏకాదశి వేడుకలకు హాజరుకావాల్సిందిగా కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి, ఈఓ సత్యనారాయణలు ఆహ్వానపత్రాన్ని అందజేశారు. నాయకులు కొలను బాల్‌రెడ్డి, ప్రధాన అర్చకులు పరాశరం రవీంద్రచార్యులు పాల్గొన్నారు.

బీజేపీ ఎంపీ రమేష్ బిదూరీ దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నేతలు

పద్మారావునగర్: బన్సీలాల్‌పేట్ డివిజన్‌లో కాంగ్రెస్ నాయకులు గురువారం ఢీల్లీ ఎంపీ రమేష్ బిదూరీ దిష్టిబొమ్మను దహనం చేశారు. కాంగ్రెస్ బన్సీలాల్‌పేట్ డివిజన్ అధ్యక్షులు చిరంజీవి కవాడిగూడ సీజీఓ టవర్స్ సమీపంలో రమేష్‌బిదూరీ దిష్టిబొమ్మను దహనం చేసి బీజేపీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకగాం. దీని కించపర్చే విధంగా రమేష్‌బిదూరీ మాట్లాటం బీజేపీ పార్టీ నీతిమాలిన తనానికి నిదర్శమన్నారు. ఓ బాధ్యతగల మహిళా ఎం.పిపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గజానంద్, సాయి సందీప్ పాల్గొన్నారు.

కేలండర్ ఆవిష్కరణ

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో పెరిక కుల ఉద్యోగుల 2025వ సంవత్సరం కేలండర్‌ను ఎమ్మెల్సీ ప్రొ.కోదండరామ్ ఆవిష్కరించారు. గురువారం ఓయూ గెస్ట్‌హౌస్‌లో పెరిక కుల ఎంప్లాయిస్ అండ్ ప్రొఫెషనల్స్ సొసైటీ ఆఫ్ ఇండియా (పెప్సీ) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ప్రొ.కోదండరామ్ ముఖ్యఅతిథిగా హాజరై కేలండర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో పెప్సీ జాతీయ అధ్యక్షులు డాక్టర్ సంగాని మల్లేశ్వర్, పెరిక హాస్టల్ వ్యవస్థాపక సభ్యుడు ఏడ్మా నర్సింగరావు, కోశాధికారి అప్పని సతీష్ కుమార్ పాల్గొన్నారు.

బీజేపీ బలోపేతానికి కృషి : ఉపేందర్ యాదవ్

లాలాపేట: తార్నాక మున్సిపల్ డివిజన్ బీజేపీ అధ్యక్షుడిగా బండారి ఉపేందర్ యాదవ్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా గురువారం ఉపేందర్ యాదవ్ మాట్లాడుతూ తార్నాక డివిజన్ అధ్యక్షుడిగా అవకాశం కల్పించిన పార్టీ అధినాయకత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. తార్నాక డివిజన్‌లో బీజేపీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

బీజేపీ సనత్‌నగర్ అధ్యక్షుల నియామకం



అధ్యక్షులను ప్రకటిస్తున్న రిటర్నింగ్ అధికారి కాంతారావు, చిత్రంలో శ్యాంసుందర్‌గౌడ్

సనత్‌నగర్: బీజేపీ సనత్‌నగర్ నియోజకవర్గంలోని డివిజన్లకు అధ్యక్షులను ప్రకటించింది. సికింద్రాబాద్–మహంకాళి జిల్లా అధ్యక్షుడు శ్యాంసుందర్‌గౌడ్ సమక్షంలో జిల్లా రిటర్నింగ్ అధికారి మాధవరం కాంతారావు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారి శంకర్‌రావులు గురువారం ఆయా డివిజన్ల అధ్యక్షులను ప్రకటించారు. సనత్‌నగర్ డివిజన్ అధ్యక్షుడిగా కృష్ణచైతన్య కుమార్, అమీర్‌పేట డివిజన్ అధ్యక్షుడిగా పవన్ కుమార్, మోండా మార్కెట్ డివిజన్ అధ్యక్షుడిగా ప్రశాంత్‌జైన్, బన్సీలాల్‌పేట డివిజన్ అధ్యక్షుడిగా మహేష్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. నియోజకవర్గంలో బీజేపీ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుండాలని సూచించారు.

పీహెచ్‌డీ ప్రవేశాల ప్రకటన విడుదల చేయాలి



రిజిస్ట్రార్‌కు వినతి పత్రం అందజేస్తున్న బైరు నాగరాజుగౌడ్, తదితరులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూలో కెటగిరి–2 పీహెచ్‌డీ ప్రవేశాలకు ప్రకటన విడుదల చేయాలని గురువారం రిజిస్ట్రార్ ప్రొ.నరేష్‌రెడ్డికి తెలంగాణ స్టూడెంట్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు బైరు నాగరాజుగౌడ్ వినతి పత్రం సమర్పించారు. అధ్యాపకుల కొరత కారణంగా ఉద్యోగ విరమణ చేసిన ప్రొఫెసర్లకు, కాంట్రాక్టు అధ్యాపకులకు పీహెచ్‌డీ గైడ్‌షిప్ ఇవ్వాలని తద్వారా అధిక మంది విద్యార్థులకు సీటు లభిస్తుందన్నారు. కార్యక్రమంలో కమలాకర్, శ్రవణ్, గోపాల్, నవీన్, బాలరాజ్, కార్తీక్, ఆనంద్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

ఓయూ విద్యార్థులు క్రీడలపై శ్రద్ధ చూపాలి

ఉస్మానియా యూనివర్సిటీ: విద్య, ఉద్యమాలతో పాటు విద్యార్థులు క్రీడల పట్ల శ్రద్ధ చూపాలని సివిల్ సర్వీస్ అకాడమి డైరెక్టర్ ప్రొ.కొండ నాగేశ్వర్ గురువారం అన్నారు. జార్జిరెడ్డి పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో గత మూడు రోజులుగా జరుగుతున్న ఫిట్నెస్ అండ్ కల్చరల్ వీక్ కార్యక్రమంలో భాగంగా వర్సిటీ బి గ్రౌండ్స్‌లో జరిగిన క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. క్రీడల వలన మానసిక ప్రశాంతతో పాటు ఆరోగ్యంగా ఉంటారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జార్జిరెడ్డి పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు ఎస్ నాగేశ్వర్ రావు, రాష్ట్ర కార్యదర్శి సుమంత్ వెంకటేష్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రొ. కొండ నాగేశ్వర్



రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ పోలీసులు

అందరం బాగుంటేనే ఏదైనా సాధించగలం

అమీర్‌పేట: అందరం బాగుంటేనే జీవితంలో ఏదైనా సాంధించగలుగుతామని ఎస్‌ఆర్‌నగర్ ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ సైదులు అన్నారు.జాతీయ రోడ్డు భద్రత మాస ఉత్సవాలలో భాగంగా గురువారం మైత్రివనమ్ చౌరస్తాలో రోడ్డు భద్రత కోసం చేపట్టవలసిన చర్యలపై విద్యార్థులు, పాదచారులకు అవగాహన కల్పించారు. రోడ్డు దాటే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. నిర్లక్ష్యంగా వెళ్లి రోడ్డు ప్రమాదాల బారిన పడి కుటుంబాలకు దూరం కావద్దని సూచించారు.

సంక్రాంతి సందడి

సనత్‌నగర్: హిందూ పబ్లిక్ స్కూల్‌లో సంక్రాంతి సంబరాలు గురువారం ఘనంగా జరిగాయి. పల్లె సంస్కృతిని ప్రతిబింబించేలా పాఠశాల ప్రాంగణాన్ని తీర్చిదిద్ది విద్యార్థులకు సంక్రాంతి వైభవాన్ని తెలియజేశారు. స్వామి వివేకానంద సేవా సమితి ఎడ్యుకేషనల్ ట్రస్ట్ చైర్మన్ శ్యాం సుందర్‌గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ మన పండుగలు మన సంస్కృతీ సంప్రదాయాలకు నిదర్శనమన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు హెచ్‌ఎస్ త్రిపాఠి, ప్రిన్సిపాల్ రాధిక, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

12న గురుగోబింద్‌సింగ్ 'ప్రకాష్ పురబ్'

సనత్‌నగర్: పదవ, చివరి సిక్కు గురువు, ఖల్సాపంత్ స్థాపకుడు శ్రీ గురుగోబింద్‌సింగ్ 358వ ప్రకాష్ పురబ్ (పవిత్ర జన్మదిన వేడుకలు)ను ఈ నెల 12న ఘనంగా నిర్వహిస్తున్నట్లు జీఎస్‌ఎస్ ప్రబంధక్ కమిటీ అధ్యక్షుడు బల్దేవ్‌సిగ్, ప్రధాన కార్యదర్శి జగన్మోహన్‌సింగ్, ఉపాధ్యక్షుడు హరిప్రీత్‌సింగ్ గులాటీలు తెలిపారు. ఈ మేరకు గురువారం ప్రకాష్ పురబ్ వివరాలతో కూడిన బ్రోచర్‌ను విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ 12వ తేదీ ఆదివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు సికింద్రాబాద్ బాలంరాయ్‌లోని క్లాసిక్ గార్డెన్‌లో 'విశాల్ దివాన్' (సామూహిక ప్రార్థనలు) జరుగుతుందన్నారు.